సాక్షి
అనంతపురం

బుధవారం । 3 । జనవరి । 2024



టీకాలతో పశువులకు రక్షణ

ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని అధికారులు తెలిపారు. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.2°/16.7°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

బాలికలు ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి, ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.దీన సూచించారు. మంగళవారం నగరంలోని బాలికల వసతిగృహాల సముదాయంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నిర్వహించిన వసతి గృహ సందర్శన, కార్యక్రమాలలో పాల్గొని ప్రసంగించారు. న్యాయమూర్తి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఎస్‌సీసీ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. న్యాయవాదుల మధ్యవర్తిత్వ కేంద్రం సభ్యుడు ఎస్.హరికృష్ణ, పద్మజ, డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం చీఫ్ కౌన్సిల్ ఇటిక నల్లప్ప, పద్మావతి విద్యార్థులకు పలుచట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినుల సంక్షేమ వసతి గృహ సంక్షేమ అధికారి వసంత, షెడ్యూల్డ్ కులాల వసతి గృహ సంక్షేమ అధికారి అనిత, వెనుకబడిన తరగతుల వసతి గృహ సంక్షేమ అధికారి మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి 'దిశ' సమావేశం వాయిదా

అనంతపురం సిటీ: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం వాయిదా పడింది. జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీ తలారి రంగయ్య అధ్యక్షతన ప్రారంభం కావాల్సిన 'దిశ' సమావేశాన్ని అనివార్య పరిస్థితుల్లో వాయిదా వేయాల్సి వచ్చిందని జెడ్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి పెన్షన్ల పెంపు సంబరాలు ఊరూరా నిర్వహించాలని ఆదేశించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు సంబరాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

అంగన్‌వాడీలు ఆందోళన విరమించాలి



ఉత్తర్వులను అతికిస్తున్న సచివాలయ ఉద్యోగి

అనంతపురం సెంట్రల్: గర్భిణులు, చిన్నారుల సంక్షేమం దృష్ట్యా అంగన్‌వాడీలు ఆందోళన విరమించి విధుల్లోకి రావాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతమయ్యాయని పేర్కొంది. గతంలో అంగన్‌వాడీలకు చాలీచాలని జీతాలు, కేంద్రాల్లో అరకొర మౌలిక సదుపాయాలు ఉండేని తెలిపింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచామని పేర్కొంది. తాజాగా హెల్పర్లకు ప్రమోషన్ కల్పించేందుకు వయో పరిమితిని 50 ఏళ్లకు పెంచిందని, వర్కర్లకు నెలకోసారి, హెల్పర్లకు రెండు నెలలకొకసారి టీఏ, డీఏలకు ఆమోదం తెలిపింది. జిల్లాలో 2,079 మెయిన్, 223 మినీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో దాదాపు 1.68 లక్షల మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందుతున్నాయని వెల్లడించింది. డిమాండ్లన్నీ పరిష్కరించినందున సమ్మె విరమించి విధుల్లోకి రావాలని కోరింది. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొంది. ఈ నోటీసులను సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయంలో అతికిస్తున్నారు.

జయహో బీసీ



- మళ్లీ రెండు ఎంపీ స్థానాలూ బీసీలకే కేటాయించిన వైఎస్సార్‌సీపీ
- అనంతపురం పార్లమెంట్ సమన్వయ కర్తగా శంకరనారాయణ, హిందూపురం పార్లమెంటు సమన్వయకర్తగా జోలదరాశి శాంత
- పెనుకొండ సమన్వయకర్తగా ఉష శ్రీచరణ్, కళ్యాణదుర్గం సమన్వయకర్తగా తలారి రంగయ్య, కదిరి సమన్వయకర్తగా మక్బూల్ అహ్మద్ నియామకం
- అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు



మాలగుండ్ల శంకరనారాయణ



జోలదరాశి శాంత



తలారి రంగయ్య



కె.వి.ఉష శ్రీచరణ్



బీఎస్ మక్బూల్ అహ్మద్

అనంతపురం ఎడ్యుకేషన్: గతంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటే.. వైఎస్సార్‌సీపీ మాత్రం అక్కున చేర్చుకుని రాజకీయ ప్రాధాన్యత కల్పించింది. దశాబ్దాలుగా రాజ్యాధికారం కోసం గళం విప్పుతున్న అణగారిన వర్గాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ దిశగా నడిపిస్తున్నారు. 'మాది బీసీల పార్టీ' అని చెప్పుకునే చంద్రబాబు ప్రకటనలకు పరిమితం కాగా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం చేతల్లో చూపించారు. తాజాగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించిన సమన్వయ కర్తల జాబితాను చూస్తే ఇదే విషయం స్పష్టమవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ఎంపీ, 24 అసెంబ్లీ స్థానాలకు సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ జాబితాలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలు, మూడు ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయి. సామాజిక సమీకరణల నేపథ్యంలో కొందరు సమన్వయకర్తలు మారారు. ఏది ఏమైనా జనాభాకు అనుగుణంగా సింహభాగం ఉన్న బీసీలకు పెద్దపీట వేశారు. మైనార్టీలకూ సముచిత ప్రాధాన్యత కల్పించారు. సమన్వయకర్తల నియామకంలో సామాజిక పరంగా పెద్దపీట వేయడంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా నియమించారు. అలాగే హిందూపురం పార్లమెంటు సమన్వయకర్తగా మాజీ ఎంపీ జోలదరాశి శాంతను నియమించారు. గుంతకల్లు వాసి అయిన శాంత 2009లో బళ్లారి ఎంపీగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో హిందూపురం ఎంపీ అభ్యర్థిగా కురుబ సామాజిక వర్గానికి చెందిన గోరంట్ల మాధవ్‌కు, అనంతపురం ఎంపీ అభ్యర్థిగా బోయ కులానికి చెందిన తలారి రంగయ్యకు అవకాశం ఇవ్వగా.. ఈసారి అనంతపురం పార్లమెంటు స్థానాన్ని కురుబ, హిందూపురం పార్లమెంటు స్థానాన్ని బోయ కులస్తులకు కేటాయించడం గమనార్హం.
- పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి ఉషశ్రీచరణ్‌ను నియమించారు. కురుబ సామాజిక వర్గానికి చెందిన ఈమె ప్రస్తుతం కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రస్తుతం అనంతపురం ఎంపీగా ఉన్న తలారి రంగయ్యను కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. అలాగే కదిరి నియోజకవర్గ సమన్వయకర్తగా ముస్లిం మైనార్టీకి చెందిన బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను నియమించారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనార్టీ వర్గం నేతలు, ప్రజలు వైఎస్సార్‌సీపీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

'అనంత' ఉద్యానవనంలో చీనీ, మామిడి తర్వాత ప్రధానపంట అరటి. ఉమ్మడి జిల్లా పరిధిలో 12 వేల మందికి పైగా రైతులు పంట సాగు చేస్తున్నారు. కరోనా కారణంగా 2020, 2021లో నష్టాలు తెచ్చిపెట్టినా... గత రెండేళ్లుగా మంచి ధరలు పలుకుతున్నాయి. రికార్డు స్థాయి ధరలతో 'అనంత' రైతు ఇంట 'హ్యాపీ బనానా'గా మారింది.





అరటి.. లాభాల్లో మేటి

సాగుకు వేళాయె..

- జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలు అరటి సాగుకు అనువు
- ఉమ్మడి జిల్లాలో 32 వేల ఎకరాల్లో అరటి సాగు!
- 8 లక్షల టన్నులకు పైగా దిగుబడి అంచనాలు
- 65 శాతం అరటి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో పండించే నాణ్యమైన అరటికి మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది అనంతపురం జిల్లాలో 27,500 ఎకరాలు, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 4,500 ఎకరాలు... వెరసి 32 వేల ఎకరాల్లో అరటి సాగు అంచనా వేశారు. పంట సాగుకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలు అనువైనవి. ఈ సీజన్‌లో 80 శాతం మేర సాగు చేస్తారు. మిగతా సాగు ఏప్రిల్, మేలో అవుతోంది. నార్పల, పుట్లూరు, యల్లనూరు, బెళుగుప్ప, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, తాడిమర్రి, కనగానపల్లి మండలాల్లో ఎక్కువగానూ, రాప్తాడు, అనంతపురం, శింగనమల, ఉరవకొండ, కూడేరు, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, బత్తలపల్లి, ధర్మవరం తదితర మండలాల్లో కొంత వరకు అరటి తోటలు సాగవుతాయి. ప్రధానంగా, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోనే 15 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. గ్రాండ్-9 అనే టిష్యూకల్చర్ అరటి మొక్కలు ఎకరాకు 1,400 నాటుతారు. వంద శాతం డ్రిప్ ఇరిగేషన్ అవలంబిస్తున్నారు. ఎకరాకు 25 నుంచి 28 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నాయి. దీంతో ఈ ఏడాది కూడా 8 లక్షల మెట్రిక్ టన్నులు అంచనా వేయగా... మార్కెట్‌లో ఉన్న ధరలను బట్టి ఈ ఏడాది రూ.1,200 కోట్ల మేర అరటి టర్నోవర్ ఉంటుందని చెబుతున్నారు.

65 శాతం ఎగుమతి

దేశంలో మరెక్కడా లేని విధంగా అనంతపురం జిల్లాలో నాణ్యమైన అరటి పండుతుండటంతో దేశీయంగా, అంతర్జాతీయ పరంగా డిమాండ్ ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లా నుంచి 65 శాతం వరకు అరటి ఉత్పత్తులు 'హ్యాపీ బనానా' పేరుతో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, రాజస్తాన్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా... తెలంగాణా, కర్ణాటక, ఏపీ ప్రాంతాల్లో మిగతా సరుకు మార్కెటింగ్ చేస్తున్నారు. గత రెండేళ్లుగా అరటి ధరలు టన్ను 15 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతుండటంతో రైతు ఇంట లాభాలపంటగా మారింది. అలాగే దేశాయ్ లాంటి కార్పొరేట్ కంపెనీలు కూడా ఇక్కడి రైతులతో కలిసి పనిచేస్తుండటంతో మార్కెటింగ్ అవకాశాలు మెరుగయ్యాయి. ప్రభుత్వం కూడా పథకాలు, రాయితీలతో ప్రోత్సహిస్తుండటంతో అరటి రైతులు హ్యాపీగా ఉన్నారు.



'హ్యాపీ బనానా' పేరుతో ఉత్తరాది రాష్ట్రాలు, గల్ఫ్ దేశాలకు వెళ్లే అనంత అరటి



ఎగుమతి చేస్తున్న నాణ్యమైన అరటి

రెండు జిల్లాల పరిధిలో అరటి సాగు	32 వేల ఎకరాలు
అందులో అనంతపురం జిల్లాలో సాగు	27,500 ఎకరాలు
శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో సాగు	4,500 ఎకరాలు
అరటి సాగు చేస్తున్న రైతులు	12 వేల మంది
ఈ ఏడాది అరటి దిగుబడి అంచనా	8 లక్షల మెట్రిక్ టన్నులు
ఈ ఏడాది అరటి టర్నోవర్ అంచనా	రూ.1,200 కోట్లు

గిట్టుబాటవుతోంది



మార్కెట్ పరిస్థితి బాగున్నందున రెండేళ్లుగా అరటి పంట గిట్టుబాటవుతోంది. ఏడాదిన్నర కిందట 12 ఎకరాల్లో సాగు చేశాను. ఎకరాకు 20 టన్నుల దిగుబడులు రాగా.. టన్ను సగటున రూ.16 వేలు పలికింది. పెట్టుబడులు పోనూ మంచి లాభమే వచ్చింది. ఈ ఏడాది కూడా 6 ఎకరాలు సాగు చేస్తున్నాను. అరటి రైతులకు డ్రిప్‌తో పాటు సబ్సిడీతో ఎరువులు అందించం, మార్కెటింగ్ పరిస్థితి కాస్త మెరుగుపరిస్తే మరింత ఉపశమనంగా ఉంటుంది.

– ఎస్.విజయభాస్కరరెడ్డి, అరటి రైతు, బొంతలపల్లి, పుట్లూరు మండలం

నాణ్యతలో మేటి



ఇక్కడి నేలలు, వాతావరణం అరటి సాగుకు అనుకూలంగా ఉన్నందున నాణ్యమైన ఉత్పత్తి వస్తోంది. నాణ్యత విషయంలో ఈక్వెడార్, పెరు, ఫిలిప్పీన్స్, హొండూరస్ లాంటి కొన్ని దేశాల సరసన అనంతపురం జిల్లా ఉండటం గర్వకారణం. నవంబర్ నుంచి మార్చి మధ్య బెస్ట్ క్వాలిటీ దిగుబడి వస్తోంది. చాలా మంది అభ్యుదయ రైతులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. గత రెండేళ్లుగా మార్కెట్‌లో రికార్డు స్థాయి ధరలు పలకడంతో అరటి సాగు పెరుగుతోంది. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలతో పాటు గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతోంది.

– జి.చంద్రశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా ఉద్యాన అధికారి

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 6న జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. గవర్నర్ పర్యటన అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరో తేదీన గవర్నర్ జిల్లాకు విచ్చేస్తారన్నారు. ఉదయం జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్నాతకోత్సవంలో పాల్గొంటారన్నారు. సాయంత్రం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఏర్పాట్లలో చిన్నపాటి పొరపాట్లకూ తావివ్వకూడదన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఏఎస్పీ (అడ్మిన్) విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డీటీసీ వీర్రాజు, అర్బన్ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, రూరల్ డీఎస్పీ శివారెడ్డి, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, పంచాయతీరాజ్ ఎస్‌ఈ భాగ్యరాజ్, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నరసింహారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన విజయవంతం చేయండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఈ నెల ఆరో తేదీన నిర్వహించే 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో పాల్గొనేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ వస్తున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని జేసీ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వికసిత్ సంకల్ప యాత్ర స్థలాన్ని జేసీ మంగళవారం పరిశీలించి, అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

- 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' ప్రారంభం
- 15 చోట్ల వైద్య శిబిరాల నిర్వహణ
- 5,155 మందికి ఓపీ సేవలు

ఆరోగ్యమే మహాభాగ్యం

అనంతపురం మెడికల్: ఆరోగ్యమే మహా భాగ్యమని వైద్యులు పేర్కొన్నారు. ప్రాథమిక దశలోనే జబ్బులను గుర్తించి సరైన వైద్యం తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' కార్యక్రమం మంగళవారం జిల్లాలో ప్రారంభమైంది. తొలిరోజు అనంతపురం రూరల్, ఆత్మకూరు, బ్రహ్మసముద్రం, బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, కణేకల్లు, కూడేరు, పెద్దపప్పూరు, పుట్లూరు, రాప్తాడు, రాయదుర్గం, శెట్టూరు, తాడిపత్రి, ఉరవకొండ, యాడికి పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ఆరోగ్య సురక్ష' క్యాంపును కలెక్టర్ గౌతమి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు 5,155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వైద్య సేవలు పొందిన వారిలో పురుషులు 2,512 మంది, మహిళలు 2,643 మంది ఉన్నారు. ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

సద్వినియోగం చేసుకోండి

'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి కోరారు. బుధవారం అనంతపురంలో 3, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి యూపీహెచ్‌సీల్లో 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



రుద్రంపేట శిబిరంలో ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న కలెక్టర్

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

కూడేరు: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని 'జగనన్న ఆరోగ్య సురక్ష' రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ పద్మకుమారి, ఉన్నతి పేర్కొన్నారు. మంగళవారం కూడేరు మండలం గొటుకూరులో సర్పంచ్ ఆశాలత అధ్యక్షతన 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు పద్మకుమారి, ఉన్నతి శిబిరాన్ని సందర్శించి, వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనుపమ జేమ్స్, వైద్య నిపుణులు శిరీషా, కృష్ణానాయక్, కిరణ్‌కుమార్, పారామెడికల్ ఆఫీసర్ నాగన్న, మండల వైద్యాధికారులు లక్ష్మీనారాయణరెడ్డి, సౌమ్యరెడ్డి, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, సీహెచ్‌ఓ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు మదన్‌మోహన్‌రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు

అనంతపురం రూరల్: ఆరోగ్యశ్రీ పథకం కింద నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. మంగళవారం రుద్రంపేట పంచాయతీలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయడంతో పాటు చికిత్సల వ్యయం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిందన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ మహబూబ్‌బీ, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో పశువులకు రక్షణ



కందుకూరులో టీకాలు వేస్తున్న జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి



గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, అధికారులు

- 'గాలికుంటు' వ్యాధితో తీవ్ర నష్టం
- చికిత్స కన్నా వ్యాధి నివారణే ముఖ్యం
- చెవిపోగుతో ప్రయోజనాలు పుష్కలం
- పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం
- కందుకూరులో ప్రారంభమైన టీకాలు

అనంతపురం అగ్రికల్చర్: ముందస్తు టీకాలు వేయించడం ద్వారా ప్రశువులకు వ్యాధులు సోకకుండా ఉంటాయని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రమాదకరం, ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి (ఫూట్ అండ్ మౌత్ డీసీసెస్) నివారణలో భాగంగా పశువులు, ఎద్దులు, గేదెలకు ముందస్తుగా ఉచితంగా టీకాలు (వ్యాక్సిన్లు) వేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరులో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డితో కలసి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వ్యాధి సోకిన తర్వాత చికిత్స చేయించడం కంటే ముందస్తు నివారణ చర్యలే ముఖ్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి నెల రోజుల పాటు ఆర్‌బీకేల వేదికగా గ్రామగ్రామాన ఎఫ్ఎండీ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3.65 లక్షల పశువులకు వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత చెవిపోగు తప్పసరిగా వేయించాలన్నారు. వీటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వం నుంచి బహుళ ప్రయోజనాలు పొందేందుకు అవకాశముంటుందన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో మరణాలు తక్కువైనా పాల ఉత్పత్తులపై గణనీయంగా ప్రభావం ఉంటుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండి, బలహీనంగా ఉండే యుక్తవయస్సు పశువుల్లో వ్యాధి వేగంగా వ్యాపిస్తుందన్నారు. అధిక జ్వరం రావడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, నోటిలోపల.. నాలుక మీద, ముట్టె లోపల బొబ్బలు ఏర్పడుతాయన్నారు. దీంతో పశువులు మేత మేయకుండా చొంగ కారుస్తుంటాయన్నారు. గిట్టల మధ్య పుండ్ల కారణంగా సరిగా నడవలేవని పరిస్థితి నెలకొంటుందన్నారు. గర్భంతో ఉన్న పశువులు అబార్షన్‌కు గురవుతాయన్నారు. పాలిచ్చే ఆవుల్లో ఉత్పత్తి తగ్గిపోయి, ఒక్కోసారి పొదుగుపై బొబ్బలు వస్తాయన్నారు. దీని వల్ల పొదుగువాపు వ్యాధి వస్తుందన్నారు. బ్యాక్టీరియా చేరి చీము కారడం వల్ల ఇతర రోగాలు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. పాలుతాగే దూడల్లో మరణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ తప్పనిసరిగా టీకాలు వేయించుకుంటే ప్రమాదకరమైన వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.

పశు వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో పశువైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం నుంచి చేపట్టిన గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీకా కార్యక్రమ పోస్టర్లను ఆమె విడుదల చేసి, మాట్లాడారు. పశు వ్యాధుల లక్షణాలపై పాడి రైతులను చైతన్య పరచాలన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ టీకా తప్పనిసరిగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంధుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సర్ లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని పురస్కరించుకుని విజువల్లీ ఛాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అనంతపురం శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అబ్దుల్‌రసూల్ ముఖ్య అతిథిగా హాజరై మ్యాచ్‌లను ప్రారంభించారు. మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు రవికాంత్‌రమణ, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ పి.సాయికృష్ణ విశిష్ట అతిథులుగా హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. బుధవారం మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. కార్యక్రమంలో విజువల్లీ ఛాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.జలంధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.వెంకటనాయుడు, జిల్లా సెక్రెటరీ ఎస్. షాజియాబీ, సలహాదారుడు వై.నాగరాజు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన ధనుంజయ (36)కు భార్య సుజాత, ఓ కుమారుడు ఉన్నారు. గతంలో వ్యవసాయ పనులతో జీవనం సాగించేవారు. పంట నష్టాలతో కుదేలైన ఆయన జీవనోపాధి కోసం ఆటో డ్రైవర్‌గా మారాడు. ఇటీవల ఆటో కూడా మరమ్మతుకు లోనైంది. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక సోమవారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం వేకువజామున ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల సమాచారం మేరకు ఎస్ఐ సాగర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి మరొకరు...

అనంతపురం సిటీ: అనంతపురం–తాటిచెర్ల మార్గంలో రైలు కింద పడి అనంతపురంలోని జార్జిపేటకు చెందిన కాకర్ల శ్రీనివాసులు(53) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెలుగు చూసిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఉరవకొండ పీఎస్ వద్ద ఉద్రిక్తత



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

ఉరవకొండ: పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని ఇంటిపై గొడవకు వచ్చిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలంటూ బాధితులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలు.. డ్రైవర్స్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మొండి సుబ్బయ్య సోదరుడి కుమారుడు శ్రీకాంత్‌కు, అదే కాలనీకి చెందిన టీడీపీ నేత మారెన్న కుమారుడు తిరుమలేష్ మధ్య పాతకక్షలున్నాయి. గత ఏడాది నవంబర్ 17న ఇద్దరి మధ్య పెద్ద ఎత్తున గొడవ చోటు చేసుకుంది. ఆ సమయంలో తిరుమలేష్, శ్రీనివాసులు, కేశవ్, బాలాజీ, పామిడి శీన, ఓబులేసు మూకుమ్మడిగా శ్రీకాంత్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. ఘటనపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరికి స్టేషన్ బెయిల్ మంజూరైంది. ఈ క్రమంలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం ఉదయం శ్రీకాంత్ ఇంటి వద్దకు తిరుమలేష్, శ్రీనివాసులు కుటుంబసభ్యులు చేరుకుని దుర్భాషలాడుతూ గొడవకు దిగారు. దీంతో ఆగ్రహించిన శ్రీకాంత్ కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పోలీసుస్టేషన్‌ను ముట్టడించి కత్తితో దాడిచేసిన తిరుమలేష్, శ్రీనివాసులతో పాటు మరో నలుగురినీ తక్షణమే అరెస్ట్ చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకారులతో సీఐ తిమ్మయ్య మాట్లాడి, నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ల్యాండ్ సర్వే, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అనంతపురం: గుంతకల్లు, అనంతపురంలోని స్కిల్ హబ్ కేంద్రాల్లో ల్యాండ్ సర్వే, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు స్కిల్ హబ్ సెంటర్ డైరెక్టర్ ఎ.గోవిందరాజులు మంగళవారం తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. అనంతరం ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులు, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు. శిక్షణా కాలంలో 20 శాతం థియరీ, 80 శాతం ప్రాక్టికల్స్ ఉంటాయి. అలాగే కమ్యూనికేషన్స్ స్కిల్స్, జాబ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో అనంతపురంలోని వైఎస్సార్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణలోని స్కిల్ హబ్ సెంటర్‌లో సంప్రదించవచ్చు. పూర్తి వివరాలను 99086 20306, 90323 45188, 94400 44121, 63006 90916 నంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చు.

'సమగ్ర'లో అక్రమాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టనున్నట్లు ఏపీసీ వరప్రసాదరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగంలో చోటుకున్న అక్రమాలపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. గోరంట్ల కేజీబీవీలో జరిగిన పనులకు, బిల్లుల డ్రా అంశంపై అక్కడి సమగ్ర శిక్ష ఏపీసీ మీనాక్షి స్పందించి విచారణకు ఆదేశించారు. ఎస్ఎంసీ అనుమతులు లేకుండా పనులు ఎలా చేశారని ఈఈ శంకరయ్యను అడిగారు. ఒకే పనిని మూడు భాగాలుగా విడగొట్టి చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బిల్లులు చెల్లింపుల్లో నిబంధనలు పాటించలేదనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే బుక్కరాయసముద్రం కేజీబీవీలో చేసిన పనులకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా సొమ్మును ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలో జమ చేయడంపై సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు విచారణ చేపట్టారు. ఎస్ఎంసీ ద్వారా ఈ బిల్లు చెల్లించలేదని విచారణలో బీకేఎస్ కేజీబీవీ ఎస్ఓ స్పష్టం చేసినట్లు సమాచారం. ఇంజినీరింగ్ అధికారులను విచారణ చేసిన అనంతరం నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామని ఏపీసీ వెల్లడించారు.

ఛత్తీస్‌గఢ్ వాసి దుర్మరణం

- మృతుడు వలస కార్మికుడు

రాప్తాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఛత్తీస్‌గఢ్ నివాసి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఛత్తీస్‌గఢ్ లోని రాజ్‌నాంధన్ గావ్ జిల్లా కడ్‌గావ్ గ్రామానికి చెందిన దుర్వే రవి (30)తో పాటు అదే గ్రామానికి చెందిన మరో నలుగురు తమిళనాడుకు చెందని వెంకటేశ్వర బోరు వెల్స్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో రాప్తాడు మండలం రామినేపల్లికి చెందిన ఓ రైతు పొలంలో బోరు వేసేందుకు సోమవారం రాత్రి చేరుకున్నారు. మంగళవారం ఉదయం బోరు వేయాల్సిన ప్రాంతాన్ని చూపుతానంటూ రైతు తెలపడంతో భోజనం చేసేందుకు రాప్తాడుకు చేరుకున్నారు. అనంతరం ఐదుగురూ రామినేపల్లికి వెళుతుండగా రాప్తాడు దాటగానే 44వ జాతీయ రహదారిపై ఐచర్ షోరూం వద్దకు చేరుకోగానే తనకు నిద్ర వస్తోందని అక్కడే ఆగిపోయాడు. మిగిలిన నలుగురూ నడుచుకుంటూ రామినేపల్లికి వెళ్లిపోయారు. మంగళవారం వేకువజామున మేల్కొన్న రవి నిద్రమత్తులో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య ఉంది. ఘటనపై ఎస్ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పత్తి కొనుగోలుకు చర్యలు చేపట్టండి

- ఎంపీ తలారి రంగయ్య



పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై చర్చిస్తున్న ఎంపీ రంగయ్య

పెద్దవడుగూరు: తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరికు ఎంపీ తలారి రంగయ్య సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో చోటు చేసుకుంటున్న జాప్యంపై మంగళవారం ఎంపీ రంగయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ దృష్టికి మండల నాయకులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన వారు వెంటనే మార్కెటింగ్ శాఖ ఏడీతో మాట్లాడారు. గత ఏడాది సాగు చేసి నిల్వ చేసిన పత్తిని సైతం కొనుగోలు చేసేలా సీసీఐ అధికారులతో మాట్లాడారు. త్వరలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేడిమాకులపల్లి మూలిరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మవరం-మచిలీపట్నం రైళ్ల మళ్లింపు

అనంతపురం సిటీ: ధర్మవరం–మచిలీపట్నం–ధర్మవరం మధ్య తిరిగే రైళ్ల (17215/17216)ను మరో మార్గంలో మళ్లించారు. ఈ మేరకు అనంతపురం రైల్వే స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముజావర్ ఫజల్ అహమ్మద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో మచిలీపట్నం నుంచి ధర్మవరం చేరుకునే రైలు, అలాగే ఈ నెల 3, 4, 5 తేదీల్లో ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే రైలును కదిరి, మదనపల్లి, రేణిగుంట మీదుగా మళ్లించినట్లు వివరించారు. గూడూరు డివిజన్‌లోని విజయవాడ వద్ద డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజుల పాటు ఈ రైళ్ల రాకపోకలు అనంతపురం, గుత్తి, యర్రగుంట్ల మీదుగా ఉండబోవని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గమనించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

పలు కోర్సుల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ

అనంతపురం: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు అనంతపురంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుంది. 60 రోజుల శిక్షణా కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందిస్తారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ పాస్ లేదా ఫెయిలైన 20 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉన్న యువతీ యువకులు అర్హులు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 100 శాతం వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎకాలజీ సెంటర్ సహకారం అందిస్తుంది. పూర్తి వివరాలకు 77807 52418లో సంప్రదించవచ్చు.

6,7 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం: నగరంలోని అశోక్ నగర్‌లో ఉన్న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ)లో ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి. బుగ్గయ్య చౌదరి, ఉపాధ్యాయుడు ఎస్. దాదాఖలందర్, ప్రధాన కార్యదర్శి జయకుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వానికి కుచ్చుటోపీ

- మానసిక వికలాంగుల కోటాలో పింఛన్
- లబ్ధిదారుడు టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా నాయకుడు
- తరచూ సమావేశాలతో దిశానిర్దేశం



సన్మానం అందుకుంటున్న ఈ వ్యక్తి పేరు తాడాల నాగభూషణం. ఈయన తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమైన టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వికలాంగుల కోటా (మానసిక వికలాంగుల)లో ప్రతినెలా ప్రభుత్వ పింఛన్ తీసుకుంటున్నారు. కానీ ఈయన కార్మిక సంఘం నేతగా నిత్యం సమావేశాల్లో దిశానిర్దేశాలు చేస్తూనే ఉన్నారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన తాడాల నాగభూషణం వృత్తిరీత్యా నాలుగు చక్రాల వాహనం మెకానిక్. ఆరేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలయ్యాయి. అధికార టీడీపీ నేతలతో పైరవీలు చేయించుకుని వైద్యుల నుంచి 48 శాతంతో మానసిక వికలాంగ సర్టిఫికెట్ పొందారు. దీన్ని ఆసరా చేసుకుని పింఛన్ తీసుకుంటున్నారు. ఇప్పటిదాకా రూ.2.50 లక్షల దాకా పింఛన్ సొమ్ము అంది ఉంటుందని తెలుస్తోంది. మరో వైపు ఎంచక్కా మెకానిక్ పని చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యక్తే గతంలో రాప్తాడు ఆటోనగర్ ప్రెసిడెంట్‌గానూ పని చేశారు. ప్రస్తుతం టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడి హోదాలో ఉన్నారు. నిజంగా మానసిక వికలత్వం ఉంటే నాయకత్వ బాధ్యతలు ఎలా నిర్వర్తిస్తున్నారో ఉన్నతాధికారులు ఆలోచించాలి.

పట్టించుకోని అధికారులు

నాగభూషణం వ్యవహారంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. అయినా సచివాలయ అధికారులు కానీ, ఎంపీడీఓ కానీ పట్టించుకోలేదు. 48 శాతం మానసిక వైకల్యం కల్గిన వ్యక్తి సాధారణ వ్యక్తిలా ఎలా ఉంటాడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాగభూషణం వికలత్వ సర్టిఫికెట్, ఫిజికల్‌గా వైద్యాధికారులతో పరీక్ష చేయిస్తే అసలు విషయం బయటపడుతుందని అంటున్నారు. అనర్హుడికి ఇవ్వడంతో తమ కోటాలో ఒక పింఛన్ తగ్గిపోయిందని వికలాంగులు వాపోతున్నారు.

బీటెక్ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (మూడో సెమిస్టర్) రెగ్యులర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మంగళవారం విడుదల చేశారు. పరీక్షలు డిసెంబర్ 19న ముగిశాయి. కేవలం 13 రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేయడానికి కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ డి. లలిత కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ కె.ఎఫ్.భారతి, ప్రొఫెసర్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ కె.కళ్యాణిరాధ, డాక్టర్ ఎ.శైలా కుమారి, డాక్టర్ బి.దిలీప్ కుమార్, బి.అజిత తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రకటనలు మానండి

అనంతపురం కల్చరల్: రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టులో వైఎస్సార్‌సీపీ ప్రమేయం లేదని, అయితే ఈ అంశాన్ని టీడీపీకి చెందిన కొందరు కుహనా మేధావులు తప్పు దోవ పట్టిస్తూ ప్రకటనలు చేస్తుండడం సిగ్గుచేటని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్ష కార్యదర్శులు కేవీ రమణ, రాజా హొన్నూరు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత టీడీపీ హయాంలో బొజ్జా దశరథరామిరెడ్డిపై అక్రమంగా బనాయించిన నాన్ బెయిల్ కేసును అన్ని ప్రజా సంఘాలు ముక్త కంఠంతో ఖండించాయని గుర్తు చేశారు. పెండింగ్ ఉన్న ఆ కేసులో ప్రస్తుతం పోలీసులు అరెస్టు చేశారనే విషయాన్ని గుర్తించాలన్నారు.

9 మంది డీబార్

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 9 మంది విద్యార్థులను డీబార్ చేశారు. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో ముగ్గురు, ఉరవకొండలో ఒకరు, గుత్తిలో నలుగురు డీబార్ అయ్యారన్నారు.

జనవాక్కు

పాఠశాలల రూపురేఖలు మారాయి



గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. అదనపు గదులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు విద్యుత్, తాగునీటి వసతులు కల్పించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనం కింద అందజేస్తున్నారు. జగనన్న విద్యాకానుక పేరుతో బడి ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, నాణ్యమైన యూనిఫాం దుస్తులు. బూట్లు, బెల్టులు, బ్యాగ్‌లను అందజేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ప్రభుత్వ బడులు ఎంతో అభివృద్ధి చెందాయి.

– విశ్వనాథరెడ్డి, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

పథకాలతో ఆదుకుంటున్నారు



ప్రభుత్వ సంక్షేమ పథకాలు మా కుటుంబ అభ్యున్నతికి దోహదపడతున్నాయి. నాకు కాలు సక్రమంగా లేదు. దివ్యాంగ పింఛన్ రూ.3,000 అందుతోంది. భూమి లేక పోవడంతో నా భర్త వన్నూరస్వామి భూమిని కౌలుకు చేస్తున్నాడు. ఆయనకు కౌలు రైతు కార్డు ద్వారా రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందుతోంది. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 చొప్పున ప్రభుత్వం నాకు అందిస్తోంది. నిరుపేద కుటుంబాల అభ్యున్నతికి దోహదపడే సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. మళ్లీ ఆయన సీఎంగా కావాలని కుటుంబం మొత్తం కోరుకుంటున్నాం.

– లక్ష్మిదేవి, శీర్పి గ్రామం, బెళుగుప్ప మండలం

పంటల సాగు సులువైంది



నాకు 1.50 ఎకరాల పొలం ఉంది. గతంలో పంట పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవాళ్లం. అధిక వడ్డీలు చెల్లించుకోలేక పంటను నష్టాలకే అమ్ముకోవాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా కింద నా బ్యాంక్ ఖాతాలోకి డబ్బు జమ చేస్తోంది. ఈ డబ్బును పెట్టుబడిగా పెట్టి పంట సాగు చేపట్టసాగాను. అప్పుల బాధ తప్పింది. పంటకు గిట్టుబాటు ధర కూడా లభ్యమవుతోంది. సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి అని చెప్పడానికి ఇదే నిదర్శనం. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నా.

– చిరంజీవి రైతు, తురుకువాండ్లు, మడకశిర మండలం

ఏపీటీఎఫ్ నగర నూతన కార్యవర్గం ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అనంతపురం నగర నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎంపిక చేశారు. ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి బి. నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. ఓబులేసు సమక్షంలో ఈ ప్రక్రియ ముగిసింది. గౌరవాధ్యక్షుడిగా కె.శ్యామ్‌సన్ కుమార్, అధ్యక్షుడిగా పి.ఖలీముల్లాఖాన్, ప్రధాన కార్యదర్శిగా జీఎస్ భాగ్యరాజ్, జిల్లా కౌన్సిలర్లుగా పట్నం శ్రీనివాసులు, డి.గంగాధర్, వై.సాయప్ప, ఉపాధ్యక్షులుగా ఈ.లక్ష్మీనారాయణ, జె.అరుణ, పి.శ్రీనివాసులు, ఎం.గోవర్ధన్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ వ్యవహరించారు.

6న జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

అనంతపురం కల్చరల్: 'మై భారత్ – వికసిత భారత్–2047' అంశంపై నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో ఈ నెల 6న జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్‌వైకే డీడీఓ శ్రీనివాసులు మంగళవారం వెల్లడించారు. సంబంధిత అంశానికి సంబంధించి మూడు నిమిషాల వ్యవధిలో ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉపన్యసించాలి. జిల్లా స్థాయి విజేతలకు కేంద్ర ప్రభుత్వ ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. అక్కడ గెలిచిన ప్రథమ విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.50 వేలు, మూడో విజేతకు రూ.25 వేలు ప్రోత్సాహకాన్ని అందిస్తారు. ఆసక్తి ఉన్న వారు శనివారం ఉదయం 9 గంటలకు ఎన్‌వైకే సమావేశ మందిరంలో జరిగే పోటీలకు హాజరు కావచ్చు. పూర్తి వివరాలకు 98498 71174లో సంప్రదించాలి.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మహమ్మద్ ఆసీఫ్

ఉరవకొండ: స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.మహమ్మద్ ఆసీఫ్ జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం ఆ పాఠశాల ఆవరణలో ఆసీఫ్‌ను ఇన్‌చార్జ్ హెచ్ఎం బాషా, పీడీలు అస్రాఫ్ హుస్సేన్, రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అనధికార పురుగు మందుల విక్రయాల నిలుపుదల

ఉరవకొండ: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో తాడిపత్రి ఏడీఏ చంగల్‌రాయుడు, ఉరవకొండ వ్యవసాయశాఖ అధికారి శుభకర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. సీతారామ ఎంటర్‌ప్రైజెస్, శ్రీసాయిరామప్ప, మహాలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాల్లో అనుమతులు పొందకుండా విక్రయానికి ఉంచిన మొత్తం రూ.2.60 లక్షల విలువైన క్రిమి సంహారక మందుల విక్రయాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

నేడు రాప్తాడులో ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పర్యటన ఉంటుందని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. పింఛన్ల పెంపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం దగ్గర, మధ్యాహ్నం 3 గంటలకు మరూరులో, సాయంత్రం 4.30 గంటలకు ఎం.బండమీదపల్లిలో కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేయండి



పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న తహసీల్దార్ షర్మిల, సీఎస్‌డీటీ ప్రతిమ

ఆత్మకూరు: ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు అందించాలని తహసీల్దార్ షర్మిల సూచించారు. మంగళవారం ఆత్మకూరులో ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. తూకాలు కచ్చితంగా ఉన్నాయా ? లేదా అని పరిశీలించారు. చక్కెర, కంది పప్పు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆత్మకూరులో ఉన్న పెట్రోల్ బంకును పరిశీలించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ప్రతిమ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022) క్యాలెండర్‌ను కమిషనర్ భాగ్యలక్ష్మి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, కార్యనిర్వహణ అధ్యక్షుడు శివశంకర్, కోశాధికారి మహేష్, నగరాధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి చిరంజీవి, ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు విమల, వెంకటేష్, అనిల్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో మార్కెట్‌యార్డు అధికారుల తనిఖీలు



మిల్లులో స్టాకు,అమ్మకాలను తెలుసుకుంటున్న మార్కెట్‌యార్డు సెక్రటరీ జయలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: రైస్ మిల్లుల్లో మార్కెట్‌యార్డు ఉన్నత శ్రేణి సెక్రటరీ (సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ) ఆర్.జయలక్ష్మి తన బృందంతో మంగళవారం తనిఖీ చేపట్టారు. వరి నూర్పిడి కాలం కావడంతో మిల్లులకు వస్తున్న ధాన్యం, అమ్మకాలు, నిల్వలపై అడిగి తెలుసుకున్నారు. లైసెన్సులు, రెన్యూవల్స్, రైతులకు ఇచ్చే బిల్లులు, చెల్లిస్తున్న ఫీజు, ఇతరత్రా రికార్డులు పరిశీలించారు. లైసెన్సులు లేకుండా మిల్లులు నడపడం, ఫీజు చెల్లించకపోవడం లాంటివి చేస్తే అపరాధ రుసుం చెల్లించాలని హెచ్చరించారు. రైతులకు ఇబ్బంది పెట్టినా, వర్జినల్ రసీదులు ఇవ్వకున్నా చర్యలు తప్పవన్నారు. నెలనెలా స్టాక్ వివరాలు అందజేయాలని ఆదేశించారు. నగర శివారు ప్రాంతాల్లో మిల్లులు, హోల్‌సేల్ బియ్యం వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

రేమా చర్చిలో క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రెవరెండ్ మనుష్యే తదితరులు

అనంతపురం కల్చరల్: నగర శివార్లలోని రేమా చర్చిలో నూతన సంవత్సర క్రైస్తవ క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెవరెండ్ మనుష్యే మాట్లాడుతూ చర్చిలు సేవా కార్యక్రమాలకు నెలవుగా ఉన్నాయని, వాటి వివరాలతో, ఆధ్యాత్మిక క్యాలెండర్లను సేవాభావంతో వితరణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం చిన్నారులకు ఆటపాటలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నరసింహులు, ఝాన్సీ కోమల్ జాయ్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష... ప్రజలకు శ్రీరామరక్ష



రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లిలో మందులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు



ఆత్మకూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



రామగిరి మండలం గంతిమర్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో పాల్గొన్న అధికారులు

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామరక్ష అని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఎం.బండమీదపల్లి గ్రామ సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాయని, ఇంకా వైద్య సేవలు అందని వారి కోసం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 351 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 22 మందిని అనంతపురానికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివకృష్ణ, సర్పంచు ఉమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఫక్కీరప్ప, మారక సుబ్బా రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ఆత్మకూరు: మండల కేంద్రంలో రెండోవిడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సబీహా సుల్తానా తెలిపారు. ఆత్మకూరు, కుర్లపల్లి, కొత్తపల్లి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైద్య పరీక్షలకు వచ్చారన్నారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, జ్వరం, ఒళ్లు నొప్పులున్న వారికి పరీక్షలు చేసి, మందులు అందించినట్లు డాక్టర్ తెలిపారు. కళ్లపరీక్షల అనంతరం ఆపరేషన్లు చేయించి, కళ్లద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి సుజన్, భార్గవి, కంటి డాక్టర్ రమణ, సీహెచ్ఓ ప్రీతి,వెన్నెల,తేజశ్వని, ఎంపీహెచ్ఎస్ శేషగిరి, ఏఎన్ఎంలు అలివేలమ్మ, సీహెచ్ఎం తులసీ, సీహెచ్ఓ షమీమ్ తార, ల్యాబ్ టెక్నీషియన్ జీవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని మూడు ప్రాంతాల్లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. 35వ సచివాలయ పరిధిలోని బుడ్డప్పనగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, 52వ సచివాలయ పరిధిలోని మంగలవారి కాలనీ ఆరోగ్య కేంద్రం, 67వ సచివాలయ పరిధిలోని ఇందిరానగర్ ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరాలు జరగనున్నట్లు తెలిపారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రామగిరి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్టేట్ నోడల్ ఆఫీసర్ శివశంకర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంతిమర్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈపథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో హెల్త్‌క్యాంప్‌ను ఏర్పాటు చేసి, రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజిల్‌బాషా, వైద్యులు ఆది శేషయ్య, త్రిలోకనాథ్, ఈఓఆర్డీ రాధా కృష్ణ, సచివాలయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బెటాలియన్ అధికారులకు సన్మానం

- ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్‌రావు



పదోన్నతి పొందిన అధికారులను సన్మానిస్తున్న కమాండెంట్ గంగాధర్ రావు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో పని చేస్తున్న ఇద్దరు అధికారులను కమాండెంట్ గంగాధర్ రావు సన్మానించారు. బెటాలియన్‌లో డీఎస్పీగా పని చేస్తున్న డీవీ రమణమూర్తికి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. అలాగే బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుభాన్‌వలి సివిల్ ఎస్ఐగా ఎంపిక కావడంతో ఇద్దరినీ పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ రమణమూర్తి యూనిట్ డాక్టర్ కౌసర్ బేగం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాము, నాగేంద్ర, లోకేశ్వర నాయుడు, రామారావు, ఆర్ ఎస్ఐలు బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ పెద్దయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

అనంతపురం మెడికల్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. మంగళవారం సూపరింటెండెంట్ ఆస్పత్రిలోని ఐసీయూ, తదితర వార్డులను పరిశీలించారు. అందుతున్న సేవలపై రోగులతో సూపరింటెండెంట్ మాట్లాడారు. ఐసీయూ, ఏఎంసీ లాంటి వార్డులో రోగి సహాయకులు అతిగా తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సూపరింటెండెంట్ వెంట ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, గ్రేడ్ – 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్– 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు ఉన్నారు.

42 మందికి పరీక్షలు: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కోవిడ్ లక్షణాలున్న 42 మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయగా, ఎవరికీ పాజిటివ్ నిర్ధారణ కాలేదని సూపరింటెండెంట్ తెలిపారు.

నీటి సరఫరాకు చర్యలు: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే నీటి సరఫరా పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో సర్వజనాస్పత్రికి నీటి సరఫరా ఆగింది. విషయాన్ని ఆయన మేయర్ వసీం దృష్టికి తీసుకెళ్లారు. మేయర్ స్పందించి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ఆస్పత్రికి ట్యాంకుల ద్వారా నీటిని పంపేలా చర్యలు తీసుకున్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు



జడ్జి బంగ్లా వద్ద మరమ్మతు పనులను చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది నిర్వాకంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని నాలుగు ప్రాంతాల్లో నీటి సరఫరా అయ్యే వాల్వ్‌లు ధ్వంసం చేసినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి, ఆదర్శనగర్ శివారు ప్రాంతం, అశోక్‌నగర్, అరవిందనగర్ తదితర ప్రాంతాల్లో చాలా ఇళ్లకు నీటి సరఫరాకాలేదు. ప్రభుత్వాస్పత్రిలో రోగులు నీటి కోసం ఇబ్బందుల పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ నీటి సరఫరా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. జడ్జి బంగ్లా వద్ద ఉన్న వాల్‌ను పరిశీలించారు. మరమ్మతు చేయాల్సిన సిబ్బంది ధర్నాకు వెళ్లడంతో నీటి సరఫరాలో జాప్యం జరిగింది. మంగళవారం వాల్వ్ రిపేరీ చేయించారు. ఇంజినీరింగ్ కార్మికులు పలు ప్రధాన ప్రాంతాల్లో వీధి దీపాలు ఆన్ చేయలేదని కమిషనర్ భాగ్యలక్ష్మి 1న, 2వ తేదీన వేకువ జామునే పర్యటించగా, తెలిసిపోయింది. అనంతరం స్ట్రీట్ లైట్లు వెలిగించేలా అధికారులను ఆదేశించారు.

పేదలకు నెరవేరుతున్న సొంతింటి కల



కనగానపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

కనగానపల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీల ద్వారా పేదలకు సొంతింటి కల నెరవేరుతోందని వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 25 వేల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కృషి చేస్తున్నారని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరిస్తే ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ అంకే రామకృష్ణ, గోపాల్, హౌసింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతపై మేయర్ ప్రత్యేక దృష్టి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు మేయర్ వసీం ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని రోజులుగా నగరపాలక సంస్థ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. దీంతో మేయర్ నగరపాలక సంస్థ అధికారులతో మంగళవారం మాట్లాడారు. ప్రధాన కూడళ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో చెత్త తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీలైతే రాత్రి వేళలో చెత్త తరలించాలన్నారు. మంగళవారం అర్ధరాత్రి మేయర్ వసీం సమక్షంలో సాయినగర్, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో చెత్త తరలించేలా నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని కార్మిక సంఘాల నాయకులకు తెలియసినట్లు తెలిపారు. కొన్ని రోజులుగా వివిధ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో వాటిని తొలగించేందుకు అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. కోవిడ్ కేసులు పెరుగుతున్న తరుణంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మేయర్ పేర్కొన్నారు. నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ

శింగనమల: మండల కేంద్రంలో ఆత్మారామాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం అయోధ్య రామమందిరం అక్షింతలు, అయోధ్య రామాలయ చిత్రపటాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మా రామాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: భోగేశ్వరాలయంలో మంగళవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతల పంపిణీకి ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.మురళీధర్ గుప్తా ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు రామేశ్వరశర్మ అక్షింతలకు పూజలు చేశారు.

కుష్టు సర్వేపై నిర్లక్ష్యం వహించొద్దు



సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ అనుపమ జేమ్స్

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు ఇంటింటా సర్వే చేపడుతోందని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ అనుపమ జేమ్స్ అన్నారు. మంగళవారం మండలంలోని గొటుకూరులో జరుగుతున్న ఇంటింటా కుష్టు సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులను వాడితే నయమవుతుందన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. సీహెచ్ఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఈఓఆర్డీ నరసింహారెడ్డి

రాప్తాడు: పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఈఓఆర్డీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక డ్రామా కట్ట వద్ద సాధారణ గ్రామసభ, బాలల గ్రామ సభ, మహిళల గ్రామ సభ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల్లోనూ గ్రామ సభలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఓఆర్డీ మాట్లాడుతూ చెత్త రహిత గ్రామాలే లక్ష్యంగా స్వచ్ఛతే సేవా, మనం-మన పరిశుభ్రత కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం- తాగునీరు, వ్యర్థ పదార్థాల నిర్వహణతో పాటు చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. విద్యాభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతోపాటు నాణ్యమైన విద్యనందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సావిత్రి, సీఎస్‌డీటీ జ్యోతి, సర్పంచులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్. శాంతికి డాక్టరేట్ ప్రదానం



ఆర్.శాంతి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎకనామిక్స్ విభాగంలో పరిశోధన చేసిన రామిరెడ్డి గారి శాంతికి డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్రాంత ప్రొఫెసర్ కే తులసీ నాయక్ పర్యవేక్షణలో ' కర్నూలు జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గిరిజన మహిళల సాధికారిత ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. శింగనమల మండలం పెరవలికి చెందిన శాంతి డాక్టరేట్ సాధించడంతో ఎకనామిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటనాయుడు అభినందించారు.

కొనసాగుతున్న 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

పెద్దవడుగూరు: మండల పరిధిలోని చిన్నవడుగూరు, దిమ్మగుడి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ రాముడు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన 17 పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులను వివరించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నాగేశ్వరశాస్త్రి, ఏపీయం ఈశ్వరయ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అడ్డపల్లకిలో తీసుకువచ్చి రథంలో అధిష్ఠించి అశేష జనవాహిని సమక్షంలో మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. గుత్తిరోడ్డు సబ్ స్టేషన్‌లో 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు చేస్తుండడంతో వేణుగోపాల్‌నగర్, వినాయక్‌నగర్, నీరుగంటివీధి, బస్టాండ్, భాగ్యనగర్, విరుపాక్షనగర్, మార్కెట్‌యార్డ్, సోములదొడ్డి వరకు ఉన్న రహదారి పక్కనే ఉన్న పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

8 నుంచి ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: రాజమండ్రిలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఏపీ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలు జరగనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నప్పయాదవ్, మల్లికార్జున మాట్లాడారు. మహాసభలో రైతుల సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. మహాసభలకు జిల్లా వ్యాప్తంగా రైతులు, రైతు సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, సనప రామకృష్ణ, మధుయాదవ్, బాలయ్య, అంజి, రమేష్, నరేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు 'సాయి విద్యానికేతన్' విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ 9వ తరగతి విద్యార్థిని వడ్డే దేదీప్య సాయి ఎస్జీఎఫ్ అండర్–14 జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 8 నుంచి 15 వరకు రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌లో జరగనున్న పోటీల్లో ఈమె పాల్గొననుంది. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తేవాలని కరస్పాండెంట్ పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు పింఛన్ల పండుగ

- కొత్తగా 345 మందికి పింఛన్లు
- కృష్ణ కళామందిర్‌లో పింఛన్ల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌దారులకు రూ.3వేల పింఛన్ అందనుంది. రూ.2,750 పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థలో మొత్తం 23,721 పింఛన్లు ఉన్నాయి. అందులో వృద్ధాప్య పింఛన్లు 11,394, వితంతువు 6,535, చేనేతలు- 314, వికలాంగులు 3,793, అభయహస్తం -106, ఫిషర్‌మెన్ -9, ఒంటరి మహిళ 948, డయాలసిస్ (సీకేడీయూ) 52, టాడీ టాపర్స్- 3, డప్పు కళాకారులు- 24, కోబ్లర్స్- 21, కళాకారులు- 19, సైనిక్ వెల్ఫేర్ – 2, ట్రాన్స్‌జెండర్స్- 11, మెడికల్ పింఛన్లు -145 ఉన్నాయి. ఈ మొత్తం పింఛన్లలో ఈ ఏడాది కొత్తగా 345 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో వృద్ధాప్య -148, వితంతువులు -106, వికలాంగులు- 90, ఒంటరి మహిళ-1 ఉన్నాయి. పింఛన్ల పంపిణీకి సంబంధించి నగర పాలక సంస్థ ఖాతాకు ప్రభుత్వం రూ.7,17,87,000 (రూ.7.15 కోట్లు) విడుదల చేసింది.

కృష్ణకళా మందిరంలో కార్యక్రమం..

నగరంలోని కృష్ణ కళామందిర్‌లో బుధవారం ఉదయం 10:30 గంటలకు పింఛన్ పంపిణీ కార్యక్రమం జరగనున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య తదితరులు పాల్గొననున్నారు. కాకినాడలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న కార్యక్రమాన్ని లబ్ధిదారులు వీక్షించనున్నట్లు తెలిపారు.

వైభవంగా పాలనాయక గ్రామోత్సవం

కుందుర్పి: మండలంలోని తమ్మయ్యదొడ్డిలో మంగళవారం పాలనాయక స్వామి జాతర వైభవంగా నిర్వహించారు. స్వామిని శ్రీమజ్జనపల్లి నుంచి తమ్మయ్యదొడ్డికి గ్రామోత్సవంగా తీసుకువచ్చి ఉదయం గంగపూజ, మధ్యాహ్నం గ్రామోత్సవం చేపట్టారు. రాత్రికి స్వామిని వెండి పల్లకిలో ప్రతిష్ఠించి ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అయ్యప్ప గ్రామోత్సవం

బొమ్మనహాళ్: నేమకల్లులో అయ్యప్ప మాలధారులు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి, అనంత గజ గరుడ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు చేపట్టారు. ఆయా ఆలయాల్లోని దేవతామూర్తుల విగ్రహాలను శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అభిషేకాలు, అర్చనలు, విష్ణు సహస్ర, స్తోత్ర, భగవద్గీత పారాయణం తదితర పూజలు నిర్వహించారు.